క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



మాక్లూర్: అడవిమామిడిపల్లి శివారు ఒడ్డెర కాలనీలో లబ్ధిదారుడు ఎ.లక్ష్మయ్యకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.49 వేల 500 చెక్కును ఆదివారం బీజేపీ జిల్లా నాయకుడు గంగోని సంతోష్ అందజేశారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఆదేశం మేరకు ఈ చెక్కును పంపిణీ చేసినట్టు ఆయన వెల్లడించారు. నాయకులు చింత ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీ కమిటీ కార్యవర్గం ఏర్పాటు



నందిపేట్(ఆర్మూర్): నందిపేట పట్టణ ముస్లిం మైనార్టీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ముస్లిం మైనార్టీ కమిటీ ఫంక్షన్ హాల్‌లో సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఎంసీ అధ్యక్షుడిగా షౌకతుల్ బారి, ఉపాధ్యక్షులుగా సయ్యద్ జమీల్, సయ్యద్ ఖదీర్, షేక్ ఇమ్రాన్, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ మక్బూల్, కోశాధికారిగా అబ్దుల్ ఘనీ, ఉప కార్యదర్శులుగా ఫారుఖ్ ఖాన్, షేక్ వాజిద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా షేక్ ఇస్మాయిల్, షేక్ ఉస్సేన్, అబ్దుల్లాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సన్మానించారు.

తోటి పూర్వ విద్యార్థినులకు అండగా ఆర్థిక సహాయం



బోధన్: పంటాఖుర్దు జెడ్పీహెచ్ఎస్ 1998–99 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న తోటి పూర్వ విద్యార్థులు అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించారు. ఆదివారం పంటాఖుర్దు గ్రామానికి వెళ్లి వారిని ఆత్మీయంగా పలకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. తోటి పూర్వ విద్యార్థిని పోతుగంటి లలిత భర్త నాగరాజు ఇటీవల మృతి చెందాడు. ఈమెకు రూ.15 వేల చెక్కు, ఇదే గ్రామానికి చెందిన మరో పూర్వ విద్యార్థిని గాదె విజయలక్ష్మి(కుమార్తె వైద్య చికిత్స కోసం)కి రూ.10 వేల చెక్కును అందించారు. పూర్వ విద్యార్థులు లక్ష్మి, రాణి, అనిత, పోశెట్టి, గోవింద్, ఉమాకాంత్, రవికాంత్, కిషన్, సలీం, గంగాధర్‌చారి, మల్లేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ కార్యక్రమాలు అభినందనీయం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని వివిధ దేవాలయాల్లో ప్రతి ఆదివారం స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఆర్మూర్ జంబి హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ రేగుల్ల సత్యనారాయణ అన్నారు. జంబి హనుమాన్ ఆలయంలో ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటిస్వచ్ఛ కార్యక్రమం నిర్వహించడం ద్వారా పరిసరాలు శుభ్రంగా ఉంటాయన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు సుంకెశ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు కృషిచేయాలి



ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు లక్ష్య సాధనకై నిరంతరం శ్రమించాలని రిటైర్డ్ కమర్షియల్ టాక్స్ అధికారి, రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్, హెచ్ఎండీఏ సెక్రెటరి కొంగి గంగాధర్‌లు అన్నారు. ఆర్మూర్ పట్టణంలో ఆదివారం జిల్లా దేవాంగ విద్యా కమిటీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పురస్కారాల అందజేత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువుతోనే ఉన్నతస్థాయికి ఎదగవచ్చన్నారు. అనంతరం జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి మట్ట రోహణరాజ్, రెండవ బహుమతి రాసరస్మిత, మూడవ బహుమతి రష్మిలకు, అదేవిధంగా గ్రామస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేశారు. పది మందికి రూ.5 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన 23 మందిని సన్మానించారు. నేతలు వినాయక్, రఘునాథ్, భమేశ్వర్, చంద్రమోహన్, రాము, మోహన్ పాల్గొన్నారు.

కంపుకొడుతోంది సారూ..!

- డబుల్ బెడ్ రూం ఇళ్లలో సెప్టిక్ ట్యాంక్ నుంచి డ్రెయినేజీకి కనెక్షన్ ఇవ్వని వైనం
- వ్యర్థాలు బయటకు రావడంతో దుర్వాసన
- భరించలేకపోతున్నామంటున్న కాలనీవాసులు



కనెక్షన్ ఇవ్వకుండా వదిలేసిన పైపు

బాల్కొండ: మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీలోని సెప్టిక్ ట్యాంక్ నుంచి డ్రెయినేజీకి కనెక్షన్ ఇవ్వడం మరిచారు. దీంతో ట్యాంక్‌లో నుంచి నీరు బయటకు వస్తుంది. మురుగు దొడ్ల నీరు కూడా బయటకు రావడంతో దుర్వాసన వస్తోంది. కాలనీలో మరుగు దొడ్లను ఏడాదిన్నరగా వినియోగిస్తున్నారు. కాలనీలో 170 ఇళ్లు నిర్మించారు. అందులో 100 ఇళ్లు పంపిణీ చేయడంతో వంద కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాలనీ మొత్తం రెండు సెప్టిక్ ట్యాంకులను నిర్మించారు. రెండు కూడా అప్పుడే నిండిపోయాయి. కనీసం వాటిని ఖాళీ చేయించే పరిస్థితి కూడ లేదు. సెప్టిక్ ట్యాంకులు ఇళ్ల మధ్యలోనే ఉండటం వల్ల దుర్వాసనను భరించలేకపోతున్నారు. అధికారులకు ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. రోడ్డెక్కి ధర్నాలు సైతం చేశారు.

కాలనీలో సమస్యలు..

మురికి కాలువల్లో పూడిక పెరిగిపోవడంతో మురికి నీరు నిలుస్తోంది. తాగు నీటి సరఫరా సక్రమంగా లేదు. దీంతో ట్యాంకర్‌తో నీటి సరఫరా జరుగుతోంది. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతా లోపం ఉండటంతో పెచ్చులూడుతున్నాయి.

దుర్వాసన భరించలేకున్నాం

సెప్టిక్ ట్యాంకు నీరు బయటకు రావడంతో కాలనీలో కంపు కొడుతుంది. ఇళ్లలోఉండలేకపోతున్నాం. పైపు లైన్ కనెక్షన్ ఇవ్వలేదు. అధికారుల చుట్టూ తిరిగిన పట్టించుకోవడం లేదు. పైపు లైన్ కనెక్షన్ వెంటనే ఇవ్వాలి. – పద్మ, కాలనీ వాసి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా

డబుల్ బెడ్ రూం కాలనీలో సెప్టిక్ ట్యాంకు నుంచి నీరు బయటకు వెళ్లటానికి ఇవ్వాల్సిన పైపు లైన్ కనెక్షన్ ఇవ్వలేదు. దీని గురించి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. కాంట్రాక్టర్ పనులను చేయించాలి. – రజనీకాంత్‌రెడ్డి, జీపీ కార్యదర్శి, బాల్కొండ

నేటి చిత్రం

ప్రమాదకరంగా సూచిక బోర్డు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రి సమీపంలో గల ఓ వసతి గృహానికి సంబంధించిన సూచిక బోర్డు వంకర తిరిగి రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉంది. వాహనదారులు ఈ బోర్డును తొలగించాలని కోరుతున్నారు.
– కె. అరుణ్, శాస్త్రినగర్, ఆర్మూర్.



మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్ : 99636 95349

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

జక్రాన్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం నారాయణ్‌పేట్‌లో ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి సాయరెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ముత్యంరెడ్డి, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న సాయరెడ్డి, ఇతర నేతలు

పేరుకే ఎంపీడీవో ఆఫీసు

- ముగ్గురితోనే నెట్టుకొస్తున్న వైనం
- ఎంపీడీవోతో పాటు ఇతర పోస్టులూ ఖాళీ



డొంకేశ్వర్ ఎంపీడీవో ఆఫీసులో ఇద్దరు ఉద్యోగులు మాత్రమే పని చేస్తున్న దృశ్యం

డొంకేశ్వర్(ఆర్మూర్): కొత్త మండలాల్లో ఏర్పాటైన ప్రజా పరిషత్(ఎంపీడీవో) కార్యాలయాలు ఉత్సవ విగ్రహాలను తలిపిస్తున్నాయి. రెండు నెలల క్రితం అట్టహాసంగా ప్రారంభించిన అధికారులు వాటి పరిపాలనను గాలికొదిలేశారు. ఒకరిద్దరు ఉద్యోగులతోనే ఆఫీసులను నడిపిస్తున్నారు. డొంకేశ్వర్ ఎంపీడీవో ఆఫీసులో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. రెగ్యులర్ ఎంపీడీవోగా వచ్చిన బ్రహ్మానందం కొద్ది రోజులు మాత్రమే పని చేసి ఆర్మూర్‌కు బదిలీ అయ్యారు. దీంతో నందిపేట్ ఎంపీవోకు డొంకేశ్వర్ ఎంపీడీవోగా ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. ప్రస్తుతం ఆయనతో పాటు ఒక సీనియర్ అసిస్టెంట్, ఒక కంప్యూటర్ ఆపరేటర్ మాత్రమే పని చేస్తున్నారు. ఎంపీడీవోతో పాటు సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు, అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది లేకపోవడంతో పరిపాలన కష్టంగా మారింది. ప్రజలకు పలు సేవలు అందించలేకపోతున్నారు. ఆఫీసును తెరిచి శుభ్రపరిచేందుకు కనీసం అటెండర్ కూడా లేకపోవడంతో పంచాయతీ కార్మికులకు పని చెప్తున్నారు. ఇటు నందిపేట్ ఎంపీడీవో ఆఫీసు నుంచి ఫైళ్లను వేరు చేసి డొంకేశ్వర్‌కు ఇంతవరకు తీసుకురాలేదు. అకౌంట్స్ బదిలీ కాకపోవడంతో కూడా డొంకేశ్వర్ ఎంపీడీవో కార్యాలయానికి ప్రభుత్వం నుంచి నయా పైసా రాలేదు. ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీ ప్రసాద్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. సిబ్బంది నియామకంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

మళ్లీ అర్ధాంతరంగా నిలిచిన పనులు

- ఆగుతూ సాగుతున్న అమ్దాపూర్ కేజీబీవీ భవన పనులు
- పనుల జాప్యంపై కాంట్రాక్టరుకు రెండు దఫాలుగా నోటీసులు



అమ్దాపూర్‌లోని కేజీబీవీ నూతన భవనం

బోధన్: అమ్దాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యా లయం(కేజీబీవీ) కొత్త భవనం నిర్మాణ పనులు మళ్లీ అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నాలుగేళ్లు గడిచినా భవనం పనులు పూర్తికావడం లేదు. మరో పది రోజుల్లో నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న పరిస్థితుల్లో విద్యార్థుల ఇబ్బందులు గట్టెక్కే పరిస్థితి కనిపించడం లేదు. 6 నుంచి 10 తరగతులతో కస్తూర్బా విద్యాలయాన్ని సొంత భవనం నిర్మించి గతంలో ప్రారంభించారు. మూడేళ్ల క్రితం ఇంటర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేశారు. పాత భవనంలో 13 గదులుండా.. నాలుగు గదుల్లో ఆఫీస్‌రూం, వంట గది, భజనశాల, సామగ్రి నిల్వకు కేటాయించారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు మొత్తం 320 మంది విద్యార్థినులున్నారు. 9 గదుల్లో వారికి వసతి, విద్యాబోధనకు సర్దుబాటు చేశారు. ప్రస్తుతం ఒకే గదిలోనే చదువుకుని నిద్రపోతూ ఇబ్బందులు పడుతున్నారు.

రూ.2 కోట్ల 5 లక్షతో కొత్త భవనం పనులు

కేజీబీవీ కొత్త భవన నిర్మాణానికి గత ప్రభుత్వం 2021లో రూ.2 కోట్ల 5 లక్షలు మంజూరు చేసి కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఈ పనులను ఈడబ్ల్యూఐడీసీ(తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ ఉమెన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఇంజినీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుత కేజీబీవీ ప్రాంగణంలోనే మూడంతస్తుల్లో 15 గదులతో కొత్త భవనం పనులు మొదలు పెట్టారు. ఏడాది తర్వాత కాంట్రాక్టరు మృతి చెందడంతో రెండేళ్ల పాటు పనులు నిలిచిపోయాయి. 2024లో అధికారులు మరో కాంట్రాక్టరుకు అప్పగించారు. మూడంతస్తుల భవనం స్లాబ్ పనులు పూర్తి చేశారు. గదులకు తలుపులు, కిటికీలు బిగించాల్సి ఉంది. తాగు నీరు, కరెంట్ పైప్‌లైన్, బాత్రూం, లెట్రిన్ రూం పనులు, పెయింటింగ్ తదితర 30 శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. రెండో దఫా పనులు పొందిన కాంట్రాక్టరు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పనుల జాప్యంపై రెండు సార్లు నోటీసులు ఇచ్చామని ఈడబ్ల్యూఐడీసీ ఏఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. మరోసారి నోటీస్ ఇస్తామని, స్పందించకుంటే కాంట్రాక్టు రద్దు చేసి మరొకరికి అప్పగిస్తామని వెల్లడించారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

డొంకేశ్వర్(ఆర్మూర్): నూతన భూ భారతి ఆర్‌వోఆర్ చట్టంపై ఈ నెల 3 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నరేశ్ కుమార్ తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం ఈ రెవెన్యూ సదస్సులు పెడుతోందని, ప్రభుత్వం రూపొందించిన దరఖాస్తు ఫారాన్ని సదస్సు వద్ద అందజేస్తామని, రైతులు అందులో సమస్య ఏంటో రాసి అధికారులను ఇవ్వాలన్నారు. 19 తర్వాత దరఖాస్తులపై విచారణ జరిపి భూ సమస్యలను తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో పరిష్కరిస్తామని తెలిపారు.

రెవెన్యూ సదస్సులు జరిగే గ్రామాలు

తేదీ	గ్రామం
3న	కోమట్‌పల్లి
4న	నికాల్‌పూర్
5న	తొండాకూర్
6న	దత్తాపూర్
9న	మారంపల్లి
10న	డొంకేశ్వర్
12న	గాదేపల్లి, చిన్నయానం
13న	జీజీ నడ్కుడ
16న	అన్నారం
17న	సిర్పూర్
18న	నూత్‌పల్లి
19న	గంగాసముందర్

ఇందిరమ్మ ఇళ్ల కోసం ఆందోళన



నవీపేట: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తమ పేర్లు లేవని మండల కేంద్రానికి చెందిన పలు వురు బాధితులు ఆదివారం తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట ధర్నా చేశారు. ఖాళీ స్థలం ఉండి ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి రుణాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూర య్యే వరకు ధర్నా చేస్తామని పులింటి నర్సింలు, పుష్ప, నర్సమ్మ, నాగమణి, రవి, చందుకుమార్‌లు తెల్పి చెప్పారు.

ఐకమత్యంగా ముందుకు సాగుదాం



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు, ప్రజలు

బోధన్‌టౌన్(బోధన్): భారత్‌పై దాడి చేస్తున్న పాకిస్తాన్ ఉగ్రమూకలను తరిమి కొట్టేందుకు దేశ ప్రజలు ఐకమత్యంతో ముందుకు సాగుతూ సైనికులకు అండగా నిలవాల్సిన అవసరముందని బీజేపీ నాయకులు అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయం సందర్భంగా బోధన్‌లో తిరంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మారుతి మందిరం వద్ద ర్యాలీని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డి మోహన్ రెడ్డి, మేడపాటి ప్రకాష్ రెడ్డిలు ప్రారంభించారు. ర్యాలీ పాత బస్టాండ్ మీదుగా అంబేడ్కర్ చౌరస్తా వరకు సాగింది. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు హిందూ సంఘాల నాయకులు మాట్లాడారు. భారత సైన్యానికి దేశ ప్రజలు ఎల్లప్పుడు అండగా నిలుస్తారని అన్నారు. పట్టణ అధ్యక్షులు గోపికిషన్, నేతలు శ్రీధర్, యార్లగడ్డ శ్రీనివాస్, ప్రవీణ్ మహరాజ్, విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం



వేల్పూర్‌లో జలాభిషేకం నిర్వహించడానికి వెళ్తున్న గ్రామస్తులు

వేల్పూర్: మండల కేంద్రంలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు. పవిత్ర గోదావరి నీటితో పూజలు చేశారు. సమృద్ధిగా వర్షాలు కురిపించాలని, పంటలు బాగా పండాలని గ్రామ దేవతలను వేడుకున్నారు.

ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకోవాలి

ఆర్మూర్‌టౌన్: ప్రతిఒక్కరు ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకున్నప్పుడే జీవితం ఆనందమయంగా మారుతుందని మదనానంద పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని రాజారాంనగర్‌లోని శివపంచాయతన శివాలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వామిజీకి స్వాగతం పలికి పాదపూజ చేశారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

రుద్రూర్: కోటగిరి మండలం యాద్‌గార్‌పూర్‌లో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మి దేవి, పెద్ద పోచమ్మ, నల్ల పోచమ్మ దేవి ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు రెండో రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. నేతలు పుల్కంటి కిష్టయ్య, గడ్డం కృష్ణకుమార్, పాపయ్య, సింపాలం లక్ష్మణ్, ఒడ్డయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఏర్పాటుకు హామీ



పెర్కిట్(ఆర్మూర్): మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటుకు కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆలూర్ మండల కేంద్రంలో ఆదివారం గ్రంథాలయం ఏర్పాటుపై గ్రామస్తులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో గ్రంథాలయ ఏర్పాటు కోసం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజ రెడ్డితో పాటు ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్తానని వినయ్ రెడ్డి హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు పేర్కొన్నా రు. నాయకులు ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి, ము క్కెర విజయ్, నడిసరం మల్లయ్య, నవనీత్, బార్ల ముత్యం, యువకులు పాల్గొన్నారు.

రోడ్డుపై పడ్డ బియ్యం సంచులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో సివిల్ సప్లయ్ కార్యాలయం నుంచి చౌక ధరల దుకాణాలకు రేషన్ బియ్యం తరలిస్తున్న తరుణంలో లారీ నుంచి బియ్యం సంచులు రోడ్డుపై పడ్డాయి. సంచులు ఎవరిపై పడకపోవడంతో ప్రమాదం తప్పింది. వెంటనే హమాలీలు రోడ్డుపై పడ్డ బియ్యం సంచులను మళ్లీ లారీపై ఎక్కించారు. ట్రాఫిక్ జామ్ అయ్యింది.



సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-3	కరాటే కిడ్ లెజెండ్స్-11.20, 5.10.35 ఖలేజా-1.35, భైరవం-7.25
స్క్రీన్-4	భైరవం-10.25, 4.20, 10.15 సింగిల్-1.35, 7.30

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)		
		డ్రెస్సడ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,600	వెండి(కిలో)	1,02,500
22 క్యారెట్స్	90,095		

– నిజామాబాద్ బిజినెస్

సంక్షిప్తం

డాక్టర్లను సస్పెండ్ చేయడం గర్హనీయం

ఆర్మూర్‌టౌన్: జహీరాబాద్‌లో ఇటీవలె జరిగిన ఘటనలో డాక్టర్లను సస్పెండ్ చేయడం హేయమైన చర్య అని, వారిని సస్పెండ్ చేయడాన్ని తెలంగాణ ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు నాగరాజు, రమేష్‌లు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక వసతుల ఆడిట్ చేయాలన్నారు. పూర్తి స్థాయి న్యాయమైన విచారణ తరువాత శిక్షాత్మక చర్యలు తీసుకోవాలన్నారు.

కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీల ఏర్పాటు

మాక్లూర్: అడవి మామిడిపల్లి, గుంజలి గ్రామాలలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవి ప్రకాష్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీలను నియమించుకున్నారు. గుంజలి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా చామంతుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పి.హరీష్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ ఇస్మాయిల్, క్యాషియర్‌గా జింక నరేష్‌ను నియమించారు. అలాగే అడవిమామిడిపల్లి గ్రామ అధ్యక్షుడిగా డి.లింగన్న, ఉపాధ్యక్షుడిగా చింత గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా రామ్ చందర్, కోశాధికారిగా జగదీష్, కార్యదర్శిగా జి.అనిల్, సలహాదారుడిగా డి.భోజందర్‌లను నియమించారు. నేతలు గంగన్న, ఎస్‌కే సలీం, గంగారెడ్డి, నావాతే నవీన్, ప్రణీత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలను నియంత్రించాలి

రెంజల్(బోధన్): రైతులకు కల్తీ విత్తనాలు, పురుగు మందులు అమ్మకుండా వ్యవసాయ శాఖ నియంత్రించాలని అఖిలభారత ఐక్య వేదిక రైతు సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. బోర్గాంలో ఆదివారం మండల ప్రతినిధుల సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బోధన్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. నేతలు గుమ్ముల గంగాధర్, పుట్టి నాగన్న, పార్వతి, నసీర్ పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్: పోతంగల్ మండలం కొడిచర్ల చెక్ పోస్ట్ వద్ద అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు టాక్టర్లను ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. ఈ ట్రాక్టర్లను కోటగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కొప్పర్గ శివారులో మరో రెండు..

బోధన్: మండలంలోని కొప్పర్గ– హంగర్గ గ్రామ శివారు నుంచి శనివారం అర్ధరాత్రి అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ఇసుక టిప్పర్లను పట్టుకున్నట్టు రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి ఆదివారం తెలిపారు. పట్టుకున్న రెండు టిప్పర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించామని, అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని ఎస్సై హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక

కమ్మర్‌పల్లి: హాసాకొత్తూరు ఉన్నత పాఠశాలకు చెందిన ప్రతిభ(9 వ తరగతి) రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కృష్ణ కుమార్ తెలిపారు. నిజామాబాద్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి పోటీలలో అద్భుత ప్రతిభ కనబరచిన ప్రతిభను సెలక్టర్లు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారని ఆయన తెలిపారు. ఈ నెల 4 నుండి 6 వరకు నల్గొండలో జరిగే పోటీలకు ప్రతిభ హాజరుకానుందని అన్నారు.